# కలల మొలకలు  నాదెళ్ల అనూరాధ

కలలు మొలకెత్తిన మొన్న లేవీ ?
వాటిని నెమరేసిన నిన్నలేవీ ?

మట్టి పెళ్లల వెచ్చని ఒడిలో ఒదిగి చూసే కలల
కలవరింతల విత్తులేవీ ?
అస్తమయ సూర్యుడితో గుసగుస లాడుతున్నాయా ?

నాలుగు దిక్కులా చేతులు చాచి ,
భూమిని ,ఆకాశాన్ని,పులుముకున్న మాయనీ ,
పలకరించే గాలినీ ,ప్రవహించే మబ్బునీ ,
పరవశం గా చుట్టుకుని, లోవెలుగుల జాడల్ని
వెతుక్కుంటున్నాయా ?

నిన్న నువ్వూ ఉన్నావ్ , నేనూ ఉన్నాను !
నిలువెల్లా కలలూ ఉన్నాయ్ !

వేళ కాని వేళ విరిగి బ్రద్దలవకుండా ,
కనురెప్పల పహరాలున్నాయ్ !

అదాటున పొంగి పొరలిపోకుండా
నిరీక్షణ దడి కట్టే హద్దులున్నాయ్ !

తూరుపు వాకిలి చిమ్మిన కిరణం
లేకొమ్మకు చిగురును పూసి ,
ప్రకృతి రంగుల వన్నెలు పొదిగి
పరిమళాల సాంత్వన అద్ది
నిన్ను పలకరించే వాస్తవమయితే .................

అదిగో మళ్లీ ......,
నా నిన్న లేవీ అంటున్నావా ?
వాటికి మరిన్ని హంగులు అద్దుతా నంటావా ?
ఇంకా వాటితో పని ఉందంటావా ?

నిన్నలు రేపులై పోతే బావుణ్ణంటావా ?
మరి రేపటి కలలు చిన్నబోవా ?

చిన్నబోయే రేపటి కలలకి ఏం చెబుతావ్ ?

★★★★



# అదే నిద్ర, అవే కలలు

వెంకట్

వెళ్తూ వెళ్తూ చూపు చివర
నువ్వు వదిలేసి వెళ్ళే చిరునవ్వుని
తోడుంచుకుంటే
రాత్రి గడవడానికి మరి నాకిక ఏ విరహం వుండదు
అదే ఆహారమూ , అదే నిద్రా...

ఆపై కళ్ళను నిండిపోయే కలల్లో
ఒకటే మత్తెక్కిన మూగ పిలుపుల సువాసన
ఆగి ఆగి వీచే విడి పెదవుల పరిమళం
ఎందుకో అర్ధంకాని తొందరలో
రాలి పడిన ఆకులపై మెత్తగా నలుగుతూ
జంట పాదాల పలవరింత
అప్పుడప్పుడే మొగ్గ తొడిగి అంతలోనే చిట్లి వికసిల్లి
విస్తుపోతూ మూర్ఛల్లే కళ్ళ రెప్పల కేరింత
మరింక క్షణకాలమైనా ఆగలేక
మాటలలో మరింకేమీ చెప్పలేక
వేచి వేచి చప్పుడుచేసే
ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసాల వింత ప్రణామం
స్తబ్ధుపడిన ప్రకృతి నడుమ
తాపంతో తామర కొలనై పరుచుకుంటూ నీ తనువు
తడవకుండానే ఆరబోయే తృష్ణను చల్లార్చుకుంటూ నా తనువు...

తలపుకు వస్తూ అవే కలలు
తలపుకు రాకుండా అదే నిద్ర!

★★★★

# మనసు రాత

క్రాంతికుమార్ మలినేని

మనసంటే మనకి విలువ లేనప్పుడు

గుండె నాలుగ్గదులూ ఎన్నిసార్లు వెతికినా
మనసులోతుల్లోకి ఎంత దూరమెళ్ళినా

ఒక్కటే

ఒయాసిస్సులేని ఎడారిలో నీరు దొరకనట్టు
అర్ధం చేసుకునే భాష మనసుకి రానప్పుడు

మాటల్ని ఎన్ని బాషల్లో చెప్పినా
ప్రతి మాటకీ ఎన్ని నానార్ధాలున్నా

ఒక్కటే

వర్షం కురిసి ఆకాశం తడిచినట్టు

****



# నా లేఖిని

శ్రీ స్వర్ణ

వేకువజామున మేలుకున్న క్షణం నుండి
నీ తలపులతో శరవేగంతో పరిగెడుతూ,
మదిలో సరసమైన స్వర్ణాక్షరాలనే లిఖిస్తుంది!

నీ తీపిఊసులు గుర్తొస్తే
మత్తెక్కించే పదాలతో
పొందికైన అక్షరాలు పరిచేస్తుంది
శ్వేతాంబరం లాంటి తెల్లకాగితంపై. !

నీవు నా చెవిలో గుసగుసలాడితే
సిగ్గులసింగారాన్ని ఒలకబోస్తూ
చెక్కిలిపై పగడపు అక్షరాలే వ్రాసేస్తుంది!

నీవు నాచెంత లేనినాడు
నాకలంలోని భావాలన్నీ
కలబోసుకొని
విరహకావ్యాలే రచిస్తుంది !

నీవు నన్ను అల్లుకున్న తరుణాన
నాట్యమయూరిలా నర్తిస్తూ
రాధామాధవుల ప్రణయబంధాన్నే రచిస్తుంది

నీతో వేసిన సప్తపది తలిచిన,
అడుగుకో పరిమళంతో
కళ్యాణకాంతులే వెదజల్లుతుంది. !

నేను నీ సొంతమైన రోజు
రతీమన్మధులకే అసూయ కలిగేలా
రసరమ్యంగా వర్ణిస్తుంది
మన ఏకాంతాన్ని!

****



# ఆశ నిరాశ

విజయకుమార్ ఎస్వీకె

వెనుకో ముందో
క్షణమో రోజో
ఒక వెలుతురు
నన్ను కమ్మేస్తుంది...

★ ★ ★

నువ్వో నేనో
యెవరో ఒకరం
ఒక ప్రశ్నకి
రెండు జవాబులిస్తాం
ప్రశ్నే తప్పయి
నివ్వెరపోతాం...

ఆకాశంవంక నేను
ఒక అదృష్టం కోసం
తపిస్తూ చూస్తాను
నా వెర్రిని
నా నిరీక్షణని
వెక్కిరిస్తూ
నన్ను నువ్ తన్నుకుపోతావ్...

రేపటిగూర్చి
ఆశ చిగురించని నిన్ను
ఇవ్వాల్టితో
అంతం అయ్యే నిన్ను
కానరాని కోనలకి విసిరేయాలన్న
కోపం...

ఐనా
నువ్ లేని
నేను లేను..

★ ★ ★

కానీ,
వెనుకో ముందో
నన్ను పూర్తిగా
కమ్మేస్తుంది ఒక వెలుతురు...

*****

# టైమ్స్ స్క్వేర్

యు.ఎ.ఎన్.మూర్తి

దిక్కులన్నీ మాకు దివిటీలు  పట్టాయి
వీధులన్నీ వెలుగు వాకలుగ మారాయి
చుక్కలన్నీ వచ్చి పక్క కూర్చున్నాయి
ఇంద్రధనుసులు ఇళ్ళ ముంగిళ్ల వాలాయి
ఈ లోకమే కాంతిచక్రమై ఎగిరింది!
పచ్చలు పగడాలు వజ్రవైఢూర్యాలు
తోరణాలై మాకు  దోయిలందించాయి
అతిలోక సుందరులు హారతులు పట్టారు
అలల కడలిగ అందమాటలాడింది
ఆటుపోటుల తోడ అడుగడుగు వేడుకలు
అంతుపొంతూ లేని అబ్బురము గొలిపాయి!
అశ్వ హేశాలు నింగి హద్దులను తాకాయి
పూలరథమై పుడమి పులకరించింది
వివశమంతా ఇచట విడిది చేసింది
వీరు వారను బేధమంతరించింది
కాల శృంగాటకము కరచాలనము చేసి
కలనాదములతోడ మిల మిలా మెరిసింది!
ఆపాదమస్తకము ఆహ్వానగీతమై
అపురూప గాంధర్వమవతరించింది
నింగికీ నేలకూ నిచ్చెనలనెత్తించి
న్యూయార్క్ నగరమే నవ్వుగా మారింది
అద్దరేతిరి కూడ ఆనందతీర్థమై
అలుపు సొలుపూ లేని హాయి సమకూడింది!!

****

# యవ్వనోద్ధతి – ఒక జవనాశ్వ హేల

నాగరాజ రామస్వామి

రేయి కడకంటి కాటుక రేఖ మెరసి
కరిగి పారిన వేకువ దారి లోన
మొగ్గ విడిచిన ఎలలేత మోవి రువ్వే
కొసరు మిగిలిన నడిరాత్రి కొంటె నవ్వు

కలయొ, నిదురనొ,మెలకువో, తెల్య రాని
మత్త లోకాల తూగాడు కొత్త జంట
దీపవల్లి ద్వయాద్వైత దీప దీప్తి !
ప్రణయ పరువ పరీరంభ పరిమళమ్ము !
మరులు ఇగురొత్తు మురిపాల విరుల వాన !

ఇది చిగురు వెన్నెలల ఈడు, ఎద మధువులు
పొంగు మధురోహలుప్పొంగు పూల వయసు!
గాలి వాలులో తేలాడు ఈల పాట !
ఉబుసు పోకల సరిఊట, ఊసులాట!

దివ్య జవనాశ్వ ఘోషమో, శివమొ ,లేక,
నాక ధుని మారెనో యవ్వనముగ, కాక,
ఈ దుడుకు ఈడు కెటులబ్బు ఇంత పొగరు,
ఇంత జవము, ఇంట రవము, ఇంత రయము,
ఇంత వలపు తుళ్ళింత , కవ్వింత ఇంత ,
ఇంత రమణీయ కొమరు జీవంత హెల!

ఉషసు క్రీగంటి వెలుగులు ఉద్గమించ
పొద్దు పొడుపుల తొలిముద్దు లద్దు కొనుచు
నవనవోన్మత్త యువ జవనాశ్వమెక్కి
భూరి వినువీధి సూరీడు స్వారి చేయు !
ధరణి పారాడు ప్రాయంపు పైర గాలి !

****

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

బ్రతుకు దారిలో సాగు నా పయనమందు
ఆపి పలుకరించినది నా యాత్మ నన్ను
చెంతనుండెడి యాత్మ నీ చెంత చేరి
ఈవు నేనేయటంచు నాకెరుక జేసె

నా శరీరమ్మునాత్మయు నా మనస్సు
ఒక పరిథిలోననే నిల్చి యుండునంచు
తలచు ననుజూసి నీనుండి తెలియజేసె
వేరెవరు కాను నీ ప్రతిబింబమంచు

ఈ దినమ్మిక ముందునకేగవలదు
ఈ వెలుగు నను వీడరాదెన్నటికిని
భ్రమ యిదైనచో వలయునీ భ్రమయె నాకు
ఇచ్చటే కాలము ఘనీభవింపవలయు

పలుకరించెడునాత్మ రావలదు తిరిగి
కాలగమనమ్ముతో ప్రేమ కరుగవలదు
తిరిగి వెన్కకు మరలెడు ఝరులు వలదు
మరలిపోయెడు స్మృతుల సంపదలు వలదు

నేను సర్వమ్ము నీలోన నిలచియుంట
నీవు సర్వమ్ము నాలోన నిలచియుంట
ఎంత సత్యమటంచు ప్రశ్నింతురెవరో
సత్యమవదేని నేనునసత్యమౌదు

*****

COMMENTS